# దైవప్రేమను పెంచుకోండి!

విద్యార్థినీ విద్యార్థులారా! అనంతపురం పౌరులారా! మీరు ప్రకటించిన పలుకులు, మీరు ప్రదర్శించిన దృశ్యములు నా హృదయములో హత్తుకొనిపోయినవి. అనంతపురంలో ఇంతటి శక్తిసామర్థ్యములు కలిగిన వ్యక్తులు ఉన్నారా అన్న సందేహానికి తావులేకుండా పోయినది. మీరు ప్రదర్శించిన దృశ్యములు, మీరు పలికిన వాక్యములు ఎంతనో ఆదర్శప్రాయంగా ఉన్నవి. అన్ని జిల్లాలకు దీనిని వ్యాప్తి గావించాలి. నేను ఆశించేది ఇదొక్కటే! నాకు ఎట్టి ఆశలూ లేవు. అందరినీ ఆనందంలో ముంచి, అందరి హృదయాలను పవిత్రం గావించి శాంతిని చేకూర్చాలన్నదే నాకున్న ఒకే ఒక ఆశ. నాకు ద్వేషమనేదే లేదు. నాకెవ్వరూ ద్వేషులు లేరు. అందరూ నావారే! అందరి ప్రేమ నా ప్రేమనే! ప్రేమ తప్ప అన్యవచనములు నానుండి ఏమాత్రము రావు. పిల్లలయందు నాకెంతో ప్రేమ. పిల్లలే నా ప్రోపర్టీ! వాళ్ళు బాగా పైకి వస్తే ప్రపంచమంతా బాగు పడుతుంది. అంతా ఐకమత్యంగా ఉండాలి. 'మేము హిందువులం' అంటారు మీరు. 'హిందూ' (HINDU) అనే పదముయొక్క అంతరార్థ మేమిటి? H - అనగా Humility (వినయం), I - అనగా Individuality (వ్యక్తిత్వం), N - అనగా Nationality (జాతీయతా భావం), D - అనగా Devotion (భక్తి), U - Unity (ఐకమత్యం). ఇవే మన పంచ ప్రాణములు. మన శరీరములో పంచభూతములు, పంచేంద్రియములు, పంచకోశములు ఉండినట్లుగా ఆధ్యాత్మికంలో ఈ ఐదక్షరములు పంచప్రాణములుగా చేరి వున్నాయి. కనుక, మీరు ఈ ఐదింటినీ కాపాడుకొని ఐకమత్యంగా ఉండాలి. ఎలాంటి చిన్న విషయములందైనను భేదాభిప్రాయము కలుగకూడదు. ఏవైనా భేదాభిప్రాయములు కలిగినప్పటికీ ఒకరిపట్ల ఒకరు క్షమాగుణముతో ప్రవర్తించాలి. అందరుకూడను భగవంతునియొక్క బిడ్డలే! కాబట్టి, అందరూ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళవలె మెలగాలి. అందరియందుకూడను ఒక్క ప్రేమ

sri sathyasai vahinamrutam

తప్ప అన్యము లేదు. ప్రేమను పెంచుకుంటే అందరూ ఏకమౌతారు. కనుక, ప్రేమను పెంచుకొని ద్వేషమును దూరము గావించుకొని మీలో ఉన్న శక్తిని అభివృద్ధిపరచుకోవాలి. పిల్లలయందు ఈ శక్తి చాలా గొప్పదిగా ఉన్నది. కాని, పెద్దలయందు అనేక రకములైన చింతలు చేరి వారి మనస్సును బలహీన పరుస్తాయి. పిల్లలు తమలో ఉన్న ఇంద్రియశక్తిని చక్కగా బలపరచుకోవాలి. అందరుకూడను ఏకమైపోవాలి. 'నాది ఈ స్టేటు, ఆ స్టేటు' అని పేర్లు పెట్టుకొని చెప్పకూడదు. మనది ఏ స్టేటూ కాదు. ఇండియా మనది. ఇదే విషయాన్ని నేను మొన్న మద్రాసులో చెప్పాను. మనది వ్యష్టితత్త్వము కాదు, సమష్టి తత్త్వము. యూనిటీని పోషించుకోవాలి. జాతీయతా భావాన్ని మరువకూడదు. 'మానవుడ'నే పేరును మనము సార్థకం చేసుకోవాలి. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలే మానవునికున్న పంచప్రాణములు. ప్రేమ మనలో పుట్టినప్పుడే శాంతి ఆవిర్భవిస్తుంది. శాంతి ఉన్నచోటే అహింస ఏర్పడుతుంది. ప్రేమ లేకపోతే శాంతియే లేదు. ఇది ఏ షాపులోనో చిక్కేటటువంటిది కాదు. బయట ఎక్కడ చూసినా peace అనేది లేదు; అంతా pieces, pieces, pieces! మనము ఏ కోటీశ్వరుడి దగ్గరకు పోయి ప్రశ్నించినప్పటికీ 'అయ్యా, నాకు సర్వము ఉంటున్నది. కాని మనశ్శాంతి లేదు', అంటాడు. మనశ్శాంతి ఒక్క ప్రేమచేతనే లభ్యమవుతుంది. అన్నింటికీ భగవత్ప్రేమయే ఆధారం. భగవత్ప్రేమను పెంచుకుంటే అన్నీ చక్కబడిపోతాయి. భగవత్ప్రేమ లేకపోతే క్షణక్షణమూ మనలో క్రోధము, ద్వేషము, అసూయ, డంబము ఇత్యాది దుర్గుణములు అభివృద్ధి అవుతుంటాయి. ఇవన్నీ మృగలక్షణాలు. ప్రేమ, శాంతి, సంతోషము, దయ ఇటువంటి మానవతా గుణములను వదలిపెట్టి మృగలక్షణాలను మనము చేర్చుకుంటున్నాము. ఎన్ని బాధలు కలిగినప్పటికీ మనము సహనంతో మెలగాలి.

**పరమ పావనమైన భారతావనియందు**
**సహనమన్నదె మనకు చక్కదనము**
**వ్రతములన్నిటియందు వన్నె గాంచినయట్టి**
**ఘన సత్యశీలమే కఠిన తపము**
**మధుర భావంబేది మన దేశమందన్న**

sri sathyasaivachanamrutam

మాతృభావముకన్న మాన్యమెద్ది?
ప్రాణంబుకంటెను మానంబె ఘనమను
మన దేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తె
ఔర! ఏమందు భారత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెఱుగలేదొ
అటులైనారు భారతీయులు నేడు

మానవుడు మహాశక్తిమంతుడు. మానవత్వముయొక్క శక్తిని ఈనాడు మనము మరచిపోయి, క్షణక్షణమూ ఈర్ష్య, అసూయ, ద్వేషము ఇత్యాది దుర్గుణములలో మునిగిపోతున్నాము. ఎవ్వరితోకూడను మనం ద్వేషం పెట్టుకోకూడదు. ఎదుటి వ్యక్తి మనపై కోపగించుకుంటే వానికొక నమస్కారము చేయాలేగాని, తిరిగి వానిపై కోపం ప్రదర్శించకూడదు. మన ద్వేషిని సహితం, 'హలో బ్రదర్, హౌ ఆర్ యు?' అని ప్రేమతో పలుకరించాలి. నీవతనిని 'బ్రదర్' అని సంబోధిస్తే తానుకూడా నిన్ను 'బ్రదర్' అని పిలుస్తాడు. 'నీవు నా ద్వేషివి' అంటే వాడు నిజంగానే నీపై ద్వేషం పెంచుకుంటాడు. నీ భావములయొక్క 'రియాక్షన్', 'రిసౌండ్', 'రిఫ్లెక్షన్' నీకే తిరిగి వస్తాయి. మనము ఎట్టి కర్మలు చేస్తామో మనకు అట్టి ఫలితమే లభిస్తుంది. మామిడిపండు తింటే పనసపండు త్రేపు వస్తుందా! రాదు. ఏ పండు తింటే దానియొక్క వాసనే వస్తుంది. కనుక, మీరు ప్రేమతో మీ హృదయాన్ని నింపుకుంటే సర్వత్రా ప్రేమయే మీ అనుభవానికి వస్తుంది.

పిల్లల్లారా! ఈ వయస్సులో మీరు ప్రేమను పెంచుకోండి. ప్రాపంచిక ప్రేమలు కాదు; దైవ ప్రేమను పెంచుకోవాలి. 'డివైన్ లవ్' మీలో ఉంటే విషయవాసనలనే 'డీప్ వైన్'కు మీరు దూరంగా ఉండగలరు. కనుక, మీరు దివ్యమైన ప్రేమతత్త్వాన్ని పెంచుకోండి. నా జీవితమంతా ఇదియే! ప్రేమతో కూడిన జీవితమే మానవత్వము. ప్రేమ లేనివాడు మానవుడే కాడు. కనుక, ప్రేమను పెంచుకొని మానవుడనే పేరును నిలబెట్టుకోండి. ఈనాడు మీరు

srisathyasaivachanamrutam

ప్రదర్శించిన, ప్రకటించిన విషయములు మన దేశానికంతటికీ వ్యాప్తి కావాలి. ఇలాంటి పవిత్రమైన విషయములను ఎవ్వరుకూడను ఏ పేపర్లోనూ వేయరు. పిచ్చిపిచ్చి సినిమా విషయాలన్నీ పేపర్లలో వేస్తుంటారు. మన హృదయంలో నిర్మలమైన, నిశ్చలమైన, నిస్వార్థమైన ప్రేమతత్త్వము కుదరాలి. కనుకనే, భగవంతుణ్ణి 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం' అన్నారు. మానవ జన్మను సార్థకం చేసుకోవాలి. దేనివల్ల సార్థకమవుతుంది? జగడాలు పెట్టుకోవడంవల్ల సార్థకమవుతుందా? ద్వేషాలు పెంచుకోవడంవల్ల సార్థకమవుతుందా? కాదు, కాదు. ఇవన్నీ మృగ లక్షణాలు. ప్రేమయే నిజమైన మానవత్వము. కనుక, ప్రియమైనటువంటి పిల్లల్లారా! మీరు ప్రేమను పెంచుకోండి. మీలో మీకు ఏవైనా అభిప్రాయ భేదాలు కలిగినప్పుడు వాటిని అణచుకోండి. ప్రేమనే మీ ప్రధానమైన ప్రాణంగా తీసుకోండి. అప్పుడు భేదము, ద్వేషము, అసూయ ఇత్యాది దుర్గుణములు ఏమాత్రము దగ్గరకు రావు. అడవిలో నివసించే జంతువులలో ఎటువంటి ద్వేషమూ ఉండదు. కాని, పట్టణాలలో నివసించే మానవులలో ఎక్కువ ద్వేషాలు వస్తున్నాయి. ఇది కాదు మానవత్వము. మానవుడు పెంచుకోవలసినది ప్రేమయేతప్ప ధనము కాదు. Money comes and goes, morality comes and grows. కనుక, నైతిక విలువలను మనము పెంచుకోవాలి.

పిల్లల్లారా! మీరు చాలా నిర్మలహృదయులు, నిశ్చల భావము గలవారు. ఇటువంటి పవిత్రమైన హృదయము కలిగిన సమయంలో మీరు ఎంతనో ప్రేమను పెంచుకోవచ్చును. మీ ప్రేమను ఆకాశమంత విశాలం గావించుకోవచ్చును. ఎటువంటి పరిస్థితియందైనను ప్రేమను మాత్రము విడువకండి. స్వామి మీ వెంటనే జంటనే ఇంటనే కంటనే ఉన్నాడు. కనుక, ప్రేమను పెంచుకోండి. త్వరలోనే నేను అనంతపురం వస్తాను. నేను అనంతపురం రాక పది సంవత్సరాలు దాటింది. కాని, ఈతూరి మీయొక్క ప్రేమవల్ల, మీ సంకల్పముచేత నేను తప్పక వస్తాను. మీరందరూ అప్పటికి మరింత పెద్దగా ప్రేమను అభివృద్ధి గావించుకొని, భజనలను అభివృద్ధి గావించుకొని సిద్ధంగా ఉంటుండాలి. 'భజన బినా సుఖ శాంతి నహీ'. భజనకంటే మించినటువంటి శాంతి మరొకటి లేదు.

స్త్రీలు ఎంతో భక్తిప్రపత్తులతో ఉన్నారు. అటువంటి స్త్రీలుకూడా సమాజమును ఏర్పరచుకొని, వారివారి గృహములను పరిశుద్ధం చేసుకొని, వారివారి పిల్లలను పవిత్రమైన మార్గంలో అభివృద్ధిపరచాలి. కాని, ఈనాడు చదువుకున్నటువంటి స్త్రీలు ఉద్యోగాలకు పోతున్నారు. ఉద్యోగములు చేసే వనితలకు కుటుంబము యొక్క సంగతి అర్థం కాదు.

**ఉద్యోగములు చేయ నువిదలందరు పోవ**
**గృహమును దిద్దెడి గృహిణి ఎవరు?**
**పరబాలురకు నేర్ప పాఠశాలకు పోవ**
**తమ బాలురకు నేర్పు తరుణులెవరు?**

మొట్టమొదట తల్లులు తమ పిల్లలకు మంచిబుద్ధులు నేర్పాలి. అప్పుడే నీవు నిజమైన గృహిణివవుతావు. నీ పిల్లల ప్రవర్తన సరిగా లేకపోతే నీవు ఆఫీసులో ఉన్నా నీ మనస్సు అశాంతిగా ఉంటుంది. కనుక, మనము మొట్టమొదట కుటుంబమును పోషించుకోవాలి. తల్లిదండ్రులను, అత్తమామలను గౌరవించాలి. అప్పుడే 'స్త్రీ' అనే పేరుకు తగిన సార్థకత చేకూరుతుంది. పిల్లలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు అందరుకూడను సత్యమార్గమును అనుసరించాలి. అప్పుడే మన భారతదేశము ఇతర దేశములకు ఆనందాన్ని అందించగలదు. మన దేశమును మనము కాపాడుకోవాలి. కేవలము మన ఇంటిని కాదు మనము కాపాడవలసినది; మన దేహమును కాదు మనము కాపాడవలసినది. దేహము ఎలాంటిది? ఈనాడు ఉంటుంది, రేపు పోతుంది. దేహమొక నీటిబుడగవంటిది. మనస్సొక పిచ్చికోతివంటిది. కాబట్టి, దేహమును అనుసరించవద్దు; మనస్సును అనుసరించవద్దు; మీ అంతరాత్మను అనుసరించండి. అంతరాత్మను అనుసరిస్తే మీరు అన్నివిధాలుగా సుఖమును అనుభవించగలరు.

ప్రేమస్వరూపులారా! ఈనాడు మీ ప్రేమ నా హృదయాన్ని కరిగించింది. ఈనాడు బీదలకు మీరు చేసిన దానధర్మములను చూసి నా హృదయము ఎంతో ఆనందముతో నిండిపోయింది. దీనికంతటికీ అశ్వత్థ నారాయణ, ఆయన కుటుంబము ఎంతో ఉత్సాహ ప్రోత్సాహముల నందించారు. ఇంకా పట్టణ ప్రజలు, ప్రొఫెసర్లు, లెక్చరర్లు అందరుకూడను చేరి చాలా ఉత్సాహంగా పనిచేశారు; అనుకున్నదానికంటే అధికంగా చేశారు.



sri sathyasai vahamrutam

(బీదలనుద్దేశించి) మీకేమైనా కావలసి ఉంటే నన్నడగండి, తప్పక నేనిస్తాను. ధనము లేదే అని చదువు మానకండి. నెలకు ఫీజులు కట్టటానికి శక్తి లేకపోతే తప్పక నన్ను అడగండి, నేనిస్తాను. డబ్బుకోసం మీ తల్లిదండ్రులను బాధించకండి. 'మాతృదేవో భవ, పితృదేవో భవ'. తల్లియే దైవం, తండ్రియే దైవం. దేవుడు ఎక్కడో ప్రత్యేకంగా ఉన్నాడని మీరు భావించకండి. నిన్ను వదలి దేవుడెక్కడికీ పోడు. నీయందే ఉన్నాడు దేవుడు, always in you, with you, around you. ఈ సత్యాన్ని మీరు దృఢం చేసుకొని ఆనందంగా ఉండండి. మీరు ఒంటరిగా ఉన్నప్పుడు 'నావెంట దేవుడున్నాడు' అని భావించండి. 'నేను ఒంటరిగా లేను. నేను, నా దేవుడు ఇరువురం ఉన్నాము' అని విశ్వసించండి. అట్టి నమ్మకాన్ని ఇప్పటినుండి మీరు పెంచుకోండి. ఏ చింతలూ రావు. ఏ బాధలూ కలుగవు. కనుక, పవిత్రమైన భావాలను మీరు హృదయంలో పెంచుకోండి.

**(సర్వజిత్ నామ సంవత్సర ఉగాది సందేశం - 2, తేదీ 20.03.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vahanamrutam